సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 21 । జూన్ । 2024



దరఖాస్తులు పరిష్కరించండి

ధరణికి సంబంధించి దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. 8లో



ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీలు

ఆటపాటలు, పౌష్టికాహారం పంపిణీకే పరిమితమైన జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మార్చనున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, సాయంత్రం కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఖమ్మంలో కలిశారు. మర్యాదపూర్వకంగా చైర్మన్‌ను కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను చైర్మన్ ప్రస్తావించగా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.


2.80 లక్షల పత్తి విత్తన ప్యాకెట్ల విక్రయం



సదస్సులో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

నేలకొండపల్లి: జిల్లాలో విత్తనాల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయనిర్మల తెలిపారు. మండల కేంద్రంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సీజన్‌లో 5.50 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధం చేయగా, ఇప్పటికే 2.80 లక్షల ప్యాకెట్లు విక్రయించినట్లు తెలిపారు. అలాగే, జిల్లాలో 80 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అంచనా వేసి, 80 క్వింటాళ్ల మిర్చి విత్తనాలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కాగా, రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని, పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. అలాగే, భూసారపరీక్షలు చేయించుకుని నివేదికల ఆధారంగా పంటలు సాగు చేయడంతో పాటు ఎరువులు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమణ, ఏడీఏ విజయచంద్ర, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నగాని శ్రీనివాస్, తెల్లగొర్ల చిన్న లింగస్వామితో పాటు మచ్చా రఘుపతి, యలమద్ది లెనిన్, నెల్లూరి వీరబాబు, కడియాల నరేష్, వల్లంచెట్ల భాస్కర్‌రావు, కే.వీ.చారి, బోనగిరి యుగంధర్, గంజికుంట్ల వెంకన్న, గణపతిరావు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, జీ.వీ.ఆర్.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా: సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఎర్రుపాలెం: చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఉద్యోగులను ఆదేశించారు. ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్ నిర్వహణ, ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అలాగే, పోలీస్ క్వార్టర్స్, పరిసరాలను కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున అక్రమ రవాణా నియంత్రణకు రాత్రి వేళ గస్తీ పెంచాలని, గ్రామాల్లో నేరాలు జరగకుండా దృష్టి సారించాలని సూచించారు. కేసుల నమోదులో తాత్సారం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సీపీ తెలిపారు.

అధునాతన పద్ధతులతో మత్స్యకారులకు లాభం

కూసుమంచి: మత్స్యకారులు చేపల పెంపకంలో అధునాతన విధానాలు పాటిస్తే లాభముంటుందని యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్ తెలిపారు. పాలేరులోని పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వ సహకారంతో ఇస్తున్న శిక్షణ వారి అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న మెళకువలతో చేపల పెంపకంలో రాణించాలని, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుకోండి.. అండగా ఉంటాం!



చట్టవ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకోవాల్సిన పోలీసులు... సత్తుపల్లి సబ్ డివిజన్‌లో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన రెండు, మూడు ఘటనలతో అక్కడి ఉద్యోగులపై పోలీస్ ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వ పెద్దలు కూడా ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. పేకాట, ఇతర దందాలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని.. చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు సబ్ డివిజన్ పోలీసుల తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేస్తుండగా, ఓ అధికారిని బదిలీ చేయాలని ఇప్పటికే నిర్ణయించినట్లు సమాచారం. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- పేకాట, ఇతర దందారాయుళ్లకు పోలీసుల సహకారం
- వివాదాస్పదంగా సత్తుపల్లి సబ్ డివిజన్ ఉద్యోగుల తీరు
- చేతివాటం ప్రదర్శిస్తూ వదిలేస్తున్నట్లు ఆరోపణలు
- విచారణ చేయిస్తున్న ఉన్నతాధికారులు..
- ఓ అధికారి బదిలీకి రంగం సిద్ధం

సరిహద్దు కావడంతో..

సత్తుపల్లి సబ్ డివిజన్ పరిధి జిల్లాకు, రాష్ట్రానికి సరిహద్దులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దులో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లితోపాటు తల్లాడ, కల్లూరు తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడే కాక అనేక ప్రాంతాల్లో పేకాట, బెట్టింగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. ఆంధ్రాకు సరిహద్దులో ఉండడంతో అటువైపు నుంచి పేకాట ఆడేందుకు వస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఇక బెట్టింగ్ సైతం రూ.వేల నుంచి రూ.లక్షల్లో సాగుతున్నట్లు చెబుతున్నారు.

ఈనేపథ్యాన నిర్వాహకులు అభయం ఇస్తుండడంతో ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడకు వచ్చే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అలాగే పలుకుబడి కలిగిన వారు కూడా ఇందులో భాగస్వామ్యం అవుతుండడం గమనార్హం. అయితే, ఇవన్నీ కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగానే.. ఇంకొన్ని చోట్ల అందరికీ తెలిసి జరుగుతున్నా సత్తుపల్లి పోలీస్ సబ్ డివిజన్‌లోని పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు ఇస్తున్న ధైర్యంతో పేకాట, బెట్టింగ్‌రాయుళ్లు రెచ్చిపోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

పందేల వేళ చేతివాటం

ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరగగా... సత్తుపల్లి పోలీసు సబ్ డివిజన్ ప్రాంతంలో గెలుపోటములపై పెద్ద ఎత్తున పందేలు జరిగాయి. పెనుబల్లి మండలంలోని ఓ చోట ఒకరి ఇంట్లో పందెంకు సంబంధించి నగదు లావాదేవీలు జరుగుతున్నాయనే సమాచారంతో సర్కిల్ అధికారి అక్కడకు వెళ్లినట్లు సమాచారం. ఈనేపథ్యాన పందెం నగదులో నుంచి సుమారు రూ.10 లక్షలు పక్కకు తప్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అధికారే కాక సత్తుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఇంకొందరు అధికారులు, సిబ్బంది తీరు ఇదే తరహాలో ఉండటంతో జూదం, బెట్టింగ్ పరిపాటిగా మారాయనే విమర్శలు వస్తున్నాయి.

హెచ్చరించినా మారని తీరు

ఈ ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకుల ద్వారా ప్రభుత్వ పెద్దలకు విషయం తెలియడంతో పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో సత్తుపల్లి సబ్ డివిజన్ అధికారులను జిల్లా అధికారులు పిలిపించి మందలించారు. ఇలాంటి వ్యవహారాలు చేయొద్దని హెచ్చరించినట్లు తెలిసింది. అయినా అధికారులు తమ తీరు మార్చుకోకపోగా.. ఆతర్వాత ఆరోపణలు ఆగకపోవడంతో విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం బయటపడగానే ఓ అధికారి సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. విచారణ పూర్తయితే సదరు అధికారిపై బదిలీ వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా.. దందాల్లో ఎవరి పాత్ర ఎంత ఉందనే అంశంపై పోలీస్ ఉన్నతాధికారులు లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఆయన లేనప్పుడు...

ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న మండలాలు పేకాటకు అడ్డాగా మారుతున్నాయి. ఈ జూదానికి సబ్ డివిజన్‌లోని సర్కిల్ అధికారి అభయం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెనుబల్లి మండలంలో పేకాట స్థావరంపై ఎస్సై జరిపిన దాడుల్లో నగదు స్వాధీనం చేసుకుని కొందరిపై కేసు నమోదు చేశారు. ఈనేపథ్యాన విచారణలో సర్కిల్ అధికారికి కొంత ముట్టజెప్పి పేకాట నిర్వహిస్తున్నామని నిందితులు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సదరు అధికారి సెలవులో ఉన్నప్పుడే దాడి జరిగిందని.. ఆయన ఉంటే అటువైపు సిబ్బంది వెళ్లేవారు కారనే ప్రచారం జరుగుతోంది. ఆ అధికారి తీరు ఇక్కడ విధుల్లో చేరిన నాటి నుంచే వివాదాస్పదంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిఘా కొరవడడంతో దందాలకు ఈ సబ్‌డివిజన్ కేరాఫ్‌గా మారుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ జరుగుతోంది..



సత్తుపల్లి సబ్ డివిజన్‌లో ఓ అధికారిపై వచ్చిన ఆరోపణల విషయంలో విచారణ జరుగుతోంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకుంటాం. విధుల్లో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదు. పోలీసులు చట్ట పరిధిలో తమ విధులు నిర్వర్తించాలి. ఇదే సమయాన శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చర్యలు తప్పవు.

– సునీల్‌దత్, పోలీస్ కమిషనర్

అందరికీ ఇళ్లు, విద్య, వైద్యమే లక్ష్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ముగిసిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రాంనారాయణ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు, విద్య, వైద్యం ఉచితంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో భట్టి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. మీడియా సంస్థల యాజమాన్యాల ఆలోచనలు ఎలా ఉన్నా జర్నలిస్టులు మాత్రం ఉన్నత ఆలోచనలతో నిజాలు మాత్రమే రాయాలని సూచించారు. మంచి జర్నలిజానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిమతానికి అనుగుణంగా పనిచేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అందరూ భావించినా గత పదేళ్లలో అలా జరగలేదని చెప్పారు. అంతేకాక మీడియా సహా ప్రజాస్వామ్యంలో ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛ విధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాహితానికి పాటుపడాలి : మంత్రి తుమ్మల

జర్నలిస్టులు ప్రజాహితం కోసం పాటుపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. స్వాతంత్ర్య పోరాటంలో పత్రికల పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. తెలంగాణలోనూ నిజాం, రజాకార్ల దౌర్జన్యాలను వెలుగులోకి తీసుకొచ్చిన పత్రికలు ప్రజలను చైతన్యం చేశాయని తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, కరోనా మహమ్మారి సమయాన సామాజిక బాధ్యతగా జర్నలిస్టులు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని చెప్పారు. కాగా, సోషల్ మీడియా పెను సవాల్‌గా మారిన వేళ కూడా విశ్వసనీయతలో పత్రికల స్థానం చెక్కు చెదరలేదని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పత్రికలు ప్రపంచానికే జ్ఞానం నేర్పిస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు పలువురు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, కె.రాంనారాయణ తదితరులు మాట్లాడగా, పది తీర్మానాలను ఆమోదించారు. ఈ మహాసభలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో పాటు పొట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, కమర్తపు మురళి, నాయుడు సత్యం, సాధు రమేష్‌రెడ్డి, రావూరి సైదుబాబు, పాలెపు వెంకటరమణ, తుపాకుల ఎలగొండస్వామి, గుర్రం ఉమామహేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మహాసభల సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కె.రాంనారాయణ ఎన్నికయ్యారు. ఇంకా ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులతో పాటు 16మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకోగా ఖమ్మంకు చెందిన ఎం.వేణుగోపాలరావుకు కార్యవర్గ సభ్యుడిగా స్థానం దక్కింది.

ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్

మాత్రల పంపిణీని ప్రారంభించిన డీఎంహెచ్ఓ, డీఈఓ



విద్యార్థినికి మాత్ర వేస్తున్న డీఎంహెచ్ఓ మాలతి, డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంవైద్యవిభాగం: పిల్లలను రక్తహీనత నుండి కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి వెల్లడించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఆవరణలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆమె డీఈఓ సోమశేఖరశర్మతో కలిసి విద్యార్థులకు మాత్రలు మింగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని 1–19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ ఆరోగ్య, విద్యా, ఐసీడీఎస్ శాఖల సహకారంతో మాత్రలు మింగిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రతీ పాఠశాలకు నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు సహకరించాలని, పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. గురువారం మాత్రలు పంపిణీ చేయగా, మిగిలిన పిల్లలకు ఈనెల 27న అందిస్తామని తెలిపారు. డీఐఓ ప్రమీల, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం శంకర్‌రావు, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రయ్‌రయ్.. గ్రీన్‌ఫీల్డ్!

- హైవేలో కొత్తగా వేంసూరు, కల్లూరు వద్ద ఎగ్జిట్లు
- ధంసలాపురం వద్ద ఇంకొకటి కావాలని డిమాండ్
- కిష్టాపురం, ఖమ్మం వద్ద టోల్‌గేట్ల ఏర్పాటుకు అవకాశం



నిర్మాణంలో ఉన్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి

హైవే మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

సత్తుపల్లి: కేంద్రప్రభుత్వం భారత్‌మాల పరియోజన పథకం కింద గ్రీన్‌ఫీల్డ్ హైవేలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం-దేవరపల్లి నడుమ 162.12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి(365 బీజీ) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారికి రూ.4,939 కోట్లు కేటాయించి ఐదు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. వీటిలో మొదటి మూడు ప్యాకేజీలు ఖమ్మం నుంచి తుంబూరు వరకు, మిగతా రెండు ప్యాకేజీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉన్నాయి. కాగా, హైవే పూర్తయితే హైదరాబాద్ – విశాఖపట్నం నడుమ 70 నుంచి 80 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.

పదికి చేరిన ఎగ్జిట్లు

ఖమ్మం-దేవరపల్లి హైవే పలు గ్రామాల మీదుగా వెళ్తుండడంతో స్థానికుల రాకపోకలకు అనువుగా ముందు ఐదు చోట్ల ఎగ్జిట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. అయితే, ఇతర చోట్ల నుంచి డిమాండ్లు వెల్లువెత్తడంతో వీటి సంఖ్య పదికి చేరింది. పాన్నెకల్లు (ఖమ్మం రూరల్ మండలం), కోదాడ క్రాస్‌రోడ్(ఖమ్మం రూరల్ మండలం), సోమవరం(వైరా మండలం), లింగాల(కల్లూరు మండలం), సీతారాంపురం(పెనుబల్లి మండలం), లింగపాలెం(వేంసూరు మండలం), రేచర్ల(చింతలపూడి మండలం, ఏపీ), దేవులపల్లి(జంగారెడ్డిగూడెం, ఏపీ), పొంగుటూరు (కొయ్యలగూడెం, ఏపీ), దేవరపల్లి(ఏపీ) ఎగ్జిట్లు నిర్మిస్తున్నారు. ఇవికాక ధంసలాపురం వద్ద సైతం ఎగ్జిట్ కావాలని డిమాండ్ వస్తోంది.

60 అడుగుల వెడల్పుతో..

గ్రీన్‌ఫీల్డ్ హైవే పచ్చని పొలాల మధ్య సాగనుంది. ప్రయాణానికి ఆటంకం లేకుండా 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరుగుతుండగా.. రెండు వైపులా 15 అడుగుల మేర రోడ్డు ఉంటుంది. మధ్యలో 10 అడుగుల వెడల్పుతో డివైడర్ నిర్మించి.. ఇరువైపులా మిగిలిన భూమిలో మొక్కలు నాటుతారు. రహదారిపైకి పశువులు రాకుండా ఇరువైపులా 15 మీటర్ల ఎత్తుతో ఫెన్సింగ్ కూడా చేస్తున్నారు.

రెండు టోల్‌గేట్లు?

హైవే నిబంధనల ప్రకారం 60కిలోమీటర్లకు ఒకటి చొప్పున టోల్‌గేట్ ఏర్పాటు చేయాలి. జిల్లాలో జాతీయ రహదారి 89 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నందున ఖమ్మం రూరల్ మండలం, సత్తుపల్లి మండలం కిష్టాపురం లేదా వేంసూరు మండలం చౌడవరంల్లో ఒక్కొక్కటి ఏర్పాటయ్యే అవకాశముంది.

ఫలించిన మంత్రి తుమ్మల కృషి

హైవే నిర్మాణం మొదలైనప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు డిజైన్లను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేశారు. వేంసూరు మండలం లింగపాలెం, కల్లూరు మండలం లింగాల వద్ద ఎగ్జిట్లు కావాలని పలుమార్లు కేంద్ర మంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేయడంతో సానుకూల స్పందన వచ్చింది. ఈమేరకు కొత్తగా ఎగ్జిట్లు మంజూరవడంపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్యాకేజీల వారీగా ఇలా....

ప్యాకేజీ	నిధులు (రూ.కోట్లలో)	నిడివి (కి.మీ.ల్లో)	ఎక్కడి నుంచి ఎక్కడికి
1	రూ.772.11	33.06	తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం
2	రూ.637.11	33.65	సోమవరం నుంచి పెనుబల్లి మండలం చింతగూడెం
3	రూ.804.69	42.119	చింతగూడెం నుంచి ఏపీలోని చింతలపూడి మండలం రేచర్ల
4, 5	రూ.2,725.09	53.474	రేచర్ల నుంచి గుర్వాయిగూడెం, దేవరపల్లి లింక్ వరకు.

అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థనతో హైవే అథారిటీ అధికారులు ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎంట్రీలు, ఎగ్జిట్ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. కొత్తగా రెండు చోట్ల ఎగ్జిట్లకు అనుమతించిన నేపథ్యాన ఆయన గురువారం ఖమ్మంలో సమీక్షించారు. ఖమ్మం నగరంలోకి ప్రవేశం కోసం ఎంట్రీ పాయింట్లు, సర్వీస్ రోడ్డు కోసం మూడు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలని తెలిపారు. ధంసలాపురం-బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్, సర్వీస్ రోడ్డు, ఎస్‌హెచ్-163జీ, ఖమ్మం-దేవరపల్లి హైవే కలిసే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డుపై సూచనలు చేయగా పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.

11ఏళ్లకు తెరుచుకున్న పాఠశాల !



పాఠశాలను ప్రారంభిస్తున్న అధికారులు

బోనకల్: మండలంలోని గార్లపాడు ప్రాథమిక పాఠశాల 11ఏళ్ల తర్వాత తెరుచుకుంది. ఈ పాఠశాలకు అప్పట్లో ఉపాధ్యాయుల కేటాయింపు జరగకపోవడంతో మూసివేశారు. ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో ఓ ఉపాధ్యాయుడిని నియమించడంతో గురువారం పునఃప్రారంభమైంది. పిల్లల తల్లిదండ్రులు పలువురు గత నెలలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయుడిని కేటాయించగా జిల్లా సెక్టోరియల్ అధికారి రామకృష్ణ, ఎంపీడీఓ లకావత్ రాజు, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి పుల్లయ్య స్థానికుల సమక్షాన ప్రారంభించారు. బడి బాట ద్వారా విద్యార్థులను చేర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీఓ టీవీఎల్ ఎన్.శాస్త్రి, సెక్రటరీ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో నేడు యోగా దినోత్సవం

ఖమ్మంవైద్యవిభాగం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాల్లో నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి ఒక ప్రకటనలో ఉద్యోగులకు సూచించారు. ఈసందర్భంగా యోగాసనాల లాభాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అంతేకాక కార్యక్రమాల ఫొటోలను శాఖ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన వచ్చేనెల 1నుంచి 8వ తేదీ వరకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అగరబత్తీలు, ధూప్ స్టిక్స్, టై అండ్ డై, క్యాండిళ్లు, నెయ్యి దీపం, ఫ్రిడ్జ్ మాగ్నెట్ తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఖమ్మంలోని ఖానాపురం హవేలీ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీ భవానీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో శిక్షణ ఉంటుంది. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 30 వ తేదీలోగా రూ.2వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 96660 13544 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఐఐటీ ముంబైలో గిరిజన విద్యార్థికి సీటు


బానోతు నవ్య

కూసుమంచి: మండలంలోని గంగబండ తండాకు చెందిన గిరిజన విద్యార్థిని బానోత్ నవ్య ప్రతిష్టాత్మక ముంబైలోని ఐఐటీలో సీటు సాధించింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కాగా, చిన్ననాటి నుండి కష్టాలను అధిగమిస్తూ చదువులో రాణించింది. పదో తరగతి కూసుమంచిలోని ఉన్నత పాఠశాలలో, పరిగిలోని గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఈఈ మెయిన్స్‌లోనూ సత్తా చాటిన నవ్య తొలి దశ కేటాయింపుల్లోనే ముంబై ఐఐటీలో సీటు సాధించగా పలువురు అభినందించారు.

నేలకొండపల్లికి ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం

నేలకొండపల్లి: రహదారుల భవనాల(ఆర్అండ్‌బీ) శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని కూసుమంచి నుంచి నేలకొండపల్లికి మార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసమే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు నేలకొండపల్లిలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనాన్ని సబ్ డివిజన్ కార్యాలయానికి కేటాయించగా గురువారం ఫర్నీచర్ తరలించారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో నేలకొండపల్లి మండలంతో పాటు, కూసుమంచి, ముదిగొండ మండలాలు వస్తాయి. కాగా, సబ్ డివిజన్‌లో డీఈఈ పోస్టుతో పాటు నేలకొండపల్లి ఏఈ పోస్టు ఖాళీగా ఉండగా, కూసుమంచి ఏఈ దేవేందర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా చాన్నాళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విశ్రాంతి భవనానికి సరఫరా నిలిచిపోగా, కార్యాలయం తరలించిన నేపథ్యాన విద్యుత్ పునరుద్ధరించారు.

సకాలంలో విధులకు హాజరైన ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): ఉద్యోగులు ఆలస్యంగా వస్తే చర్యలు తీసుకుంటామని సింగరేణి సంస్థ బుధవారం రాత్రి సర్క్యులర్ విడుదల చేయడంతో కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయ ఉద్యోగులు గురువారం సకాలంలో హాజరయ్యారు. ఇద్దరు, ముగ్గురు మినహా మిగతా వారంతా సకాలంలో రావడం విశేషం. ఈ విషయమై సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన కార్యాలయంలో సుమారు 40శాతం మంది ఉద్యోగులు విధులకు ఆలస్యంగా వస్తున్నట్లు గుర్తించి హెచ్ఓడీలకు చెప్పినా మార్పు రాకపోవడంతో సర్క్యులర్ విడుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. త్వరలోనే బయోమెట్రిక్ విధానం అమలుచేయడమే కాక అన్ని శాఖల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

సుజాతనగర్: నకిలీ నోట్ల రవాణా చేసే ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సుజాతనగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం సీఐ రాయల వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతంపేట బంజార గ్రామానికి చెందిన మాళోత్ రాంప్రసాద్, బానోత్ శ్రీనులకు ఖమ్మం జిల్లా బుగ్గపాడుకు చెందిన మంచాల వ్యాపారి బెజవాడ సురేష్‌కుమార్‌తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటికే సురేష్‌కుమార్ రాజమండ్రికి చెందిన పెద్దగొళ్ల వంశీకృష్ణ, కాకినాడకు చెందిన సింగంశెట్టి సత్యఫణికుమార్, సిద్దిపేటకు చెందిన రాకేష్‌లు ముఠాగా ఏర్పాడి రాజమండ్రి కేంద్రంగా నకిలీనోట్ల దందా సాగిస్తున్నారు. రూ. లక్షకు రూ. 3 లక్షల నకిలీ నోట్లు ఇస్తామని నమ్మబలికి బానోత్ శ్రీను, రాంప్రసాద్ వద్ద నుంచి రూ.7.50 లక్షలు తీసుకున్నారు. అనంతరం చిన్న పిల్లలు ఆడుకునే రూ.500 నోట్ల కట్టలను ఇచ్చి మోసం చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం నలుగురు నిందితులు సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద నకిలీనోట్లను మార్చేందుకు ప్రయత్నం చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, రాకేష్ అనే వ్యక్తి పారిపోయాడు. నిందితుల నుంచి రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా కేసు ఛేదించిన ఎస్ఐ జుబేదా బేగంను సీఐ అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,000	1,700
పెసలు	7,625	6,800
మిర్చి	19,500	12,000
మిర్చి తాలు	10,200	7,500
ఏసీ మిర్చి	20,680	20,000
ఏసీ తాలు	10,100	9,000
పత్తి	7,050	4,000

– ఖమ్మం వ్యవసాయం

ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు


అంగన్‌వాడీ టీచర్ల శిక్షణను ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ రాంగోపాల్‌రెడ్డి

- పూర్వ ప్రాథమిక విద్య బోధించేందుకు ఏర్పాట్లు
- 11మంది మాస్టర్ ట్రెయినీల ద్వారా టీచర్లకు శిక్షణ
- ఇప్పటికే చేరిన పుస్తకాలు.. ఈసారి చిన్నారులకు యూనిఫాం పంపిణీ
- జిల్లాలో 36,971 మంది చిన్నారులకు లబ్ధి


శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించడమే కాక అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తుంది. నూతన విద్యాచట్టానికి అనుగుణంగా ప్రాథమిక దశలోనే చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మార్చేందుకు సిద్ధమైంది. తద్వారా జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుండి ఆరేళ్ల లోపు చిన్నారులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో విద్య అందనుంది. ఇందుకోసం ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం నుంచి శిక్షణ ఇస్తున్నారు. తొలిదశలో ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ తరహా విద్యా విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాక.. దశల వారీగా అన్ని కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మారుస్తారు. ఈ నిర్ణయంతో ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం కానున్నాయి.

పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధం

జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వీటి పరిధిలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. తొలిదశలో 771 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మారుస్తారు. ఇందుకోసం పుస్తకాలను ఇప్పటికే ప్రభుత్వం జిల్లాకు పంపించింది. ఆటపాట లతో పాటు, మన దేహం – మన పరిసరాలు తదిత ర అంశాలతో కూడిన ఈ పుస్తకాలను క్లస్టర్ల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాదిరిగా అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఇచ్చేందుకు యూనిఫామ్ క్లాత్ పంపించారు. యూనిఫామ్ కుట్టించే బాధ్యతను డీఆర్డీఏ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించారు. 10వేల మంది చిన్నారులకు రెండు జతల చొప్పున యూనిఫామ్‌ను దఫాలుగా అందిస్తారు.

36,971 మంది చిన్నారులకు లబ్ధి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుండి ఆరేళ్ల లోపు చిన్నారులు 36,971 మంది ఉన్నారు. కొత్త విధానం ద్వారా చిన్నారులకు ప్రాథమిక విద్య అందనుంది. ప్రీ ప్రైమరీ విద్యను అందించేందుకు క్లస్టర్ల వారీగా జిల్లా నుండి 11మంది సూపర్‌వైజర్లను ఎంపిక చేసి ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వీరు మాస్టర్ ట్రెయినీలుగా బుధవారం నుండి జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు. 35 మంది టీచర్లను గ్రూప్‌గా చేసి మూడేసి రోజులు శిక్షణ ఇప్పిస్తున్నామని అధికారులు తెలిపారు.

వచ్చే నెల నుంచి బోధన



జిల్లాలో ప్రీ స్కూళ్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినీల ద్వారా జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇప్పిస్తున్నాం. బుధవారం ఐదు బ్యాచ్‌లకు శిక్షణ మొదలైంది. శిక్షణ పూర్తికాగానే ప్రాజెక్టుల వారీగా పుస్తకాలు, పిల్లలకు యూనిఫామ్ అందించి నూతన పాఠ్యప్రణాళిక ద్వారా బోధన ప్రారంభిస్తాం.

– రాంగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ

ధరణి దరఖాస్తులు పరిష్కరించండి


అంగన్‌వాడీ కేంద్రంలో నేలపై కూర్చుని వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- చింతకాని మండలంలో పర్యటన

చింతకాని: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. చింతకాని తహసీల్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ధరణి, రిజిస్ట్రేషన్ స్లాట్ల పెండింగ్ వివరాలను తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తు పెండింగ్ ఉన్న ఓ వ్యక్తి ఆయనే స్వయంగా ఫోన్‌చేసి తహసీల్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా, తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో కారణాలను దరఖాస్తుదారులకు తెలియచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయానికి వస్తున్నారా, మందులు ఇస్తున్నారా, లేదా అని తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలని, వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి సారించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఆతర్వాత అనంతరం చింతకాని ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. నేలపై కూర్చుని చిన్నారులతో మాట్లాడారు. కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణీలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రనాయక్, వైద్యాధికారి అల్తాఫ్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో చర్ల వాసులు?

చర్ల: చర్లకు చెందిన ఐదుగురు వ్యక్తులను గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల చర్లకు చెందిన ఓ యువకు డు మావోయిస్టులకు అవసరమైన సామగ్రి తీసుకెళ్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. అతడిని విచారించాక, పోలీసులు చర్లకు వచ్చి మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని బీజాపూర్ తరలించినట్లు తెలిసింది.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి, నాయకులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముజమ్మిల్ ఖాన్‌ను కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తదితరులు కలెక్టర్‌ను సన్మానించారు. ఇంకా టీఎన్జీవోస్ ఆధ్వర్యాన కొణిదన శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాస్, శ్రీధర్‌సింగ్, దుర్గాప్రసాద్, జైపాల్, రవిచంద్ర, విజేత, సుశ్మిత, బాలకృష్ణ, రాంబాబు, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుగులోతు బిక్కు, కాంపాటి వెంకటరమణ, నాయకులు వెంకన్న, అంజమ్మ, కోడి లింగయ్య, బుర్రి వెంకటేశ్వర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు బుర్రి వినోద్ కుమార్, మహ్మద్ అలీ, ఎండీ.యాకుబ్ పాషా, నవీన్, శేషు, అనిల్‌కుమార్ కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు కూడా కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు.

ఎంపీజే బృందం..

ఖమ్మం మామిళ్లగూడెం: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఎంపీజే బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఖాసిం, సతీష్‌తో పాటు రఫీక్, మజీద్, హుస్సేన్‌మియా, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్..

ఖమ్మంవ్యవసాయం: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. బిజినెస్ మేనేజర్ కె.సందీప్, డైరెక్టర్ కుంచారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కలెక్టర్‌ను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుర్రి వినోద్‌కుమార్, ప్రతినిధులు మొహ్మద్ అలీ, ఎండీ యాకూబ్ పాషా, నవీన్, శేషు, మూర్తి, అనిల్ నాయక్, చంద్రశేఖర్, హరీష్, ఖలీల్ పాషా, కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

పండితాపురం సంత వేలం వాయిదా

ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో అధికారుల నిర్ణయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం)లో ఉన్న శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత వేలాన్ని గురువారం నిర్వహించగా మద్దతు ధర రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. సంత ఆవరణంలో జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యాన జరిగిన వేలాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి ప్రారంభించారు. తొమ్మిది నెలల కాలానికి గాను ప్రభుత్వ మద్దతు ధర రూ.1,84,70,646గా ప్రకటించగా.. భూక్యా వీరన్న, బానోత్ శంకర్ వేలంలో పాల్గొన్నారు. వీరిలో భూక్యా వీరన్న రూ.1.30 కోట్లకు పాడినా ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ సీఈఓ ప్రకటించారు. అయితే, ప్రభుత్వ మద్దతు ధరకు మించి పాడితే తమకు గిట్టుబాటు కాదని, గతంలోనూ ఇదే పరిస్థితి ఎదురైందని పాటదారులు తెలిపారు. కాగా, మళ్లీ వేలం ఎప్పుడు నిర్వహించేది అధికారులు వెల్లడించాల్సి ఉంది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయగా, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీఓలు రాజారావు, జీపీఎస్.సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, జీపీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలి

శిక్షణ తరగతుల్లో రాష్ట్ర నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్

వైరా: ఎన్నికల సమయాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరాలో గురువారం సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ, సామాజిక చైతన్య శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత సీనియర్ నాయకుడు గుగులోత్ పంతునాయక్ సంఘం జెండాను ఆవిష్కరించాక ఇటీవల మృతిచెందిన గుగులోత్ ధర్మా, భూక్యా జగ్యానాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం శ్రీరాం, వీరభద్రం మాట్లాడుతూ కేంద్రం గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబించడంతోనే బీజేపీకి ఇటీవల ఎన్నికల్లో గిరిజనులు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వడమే కాక మైదాన ప్రాంతాల్లోనూ ఐటీడీఏలు స్థాపించి గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేలా సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గ్రామపంచాయతీలుగా మార్చిన తండాల అభివృద్ధికి నిధులుకేటాయించాలని, పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పించాలన్నారు. సంఘం నాయకులు బానోత్ బన్సీలాల్, భూక్యా జ్యోతి, కృష్ణనాయక్, వాంకుడోత్ అమర్‌సింగ్, షణ్ముక్, వెంకన్న, కిషన్, పంతునాయక్, శ్రీనివాస నాయక్, మధు, విజయ, అశ్వని, హరిచంద్, శోభన్ నాయక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యకు మనోవర్తి చెల్లించకపోవడంతో భూమి వేలం

తల్లాడ: భార్యకు మనోవర్తి ఇవ్వకపోవడంతో భర్త భూమిని వేలం వేసి డబ్బు చెల్లించాలని తల్లాడ తహసీల్దార్‌కు కోర్టు నుంచి ఆదేశాలందాయి. దీంతో తహసీల్దార్ రవికుమార్ గురువారం భూములు సర్వే చేయించారు. తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన పి.శిరీష తన భర్త నరేష్ నుంచి పోషణ నిమిత్తం మనోవర్తి ఇప్పించాలని కోర్టును ఆశ్రయించింది. దీంతో రూ.7.50లక్షలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇవ్వగా నరేష్ చెల్లించలేదు. ఈనేపథ్యాన ఆయనకు ఉన్న వ్యవసాయ భూమిని వేలం వేసి నగదు ఇప్పించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు, మొబైల్ కోర్టు ద్వారా తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపించింది. ఈనేపథ్యాన తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ భాస్కర్, సర్వేయర్ భూమిని సర్వేచేయించి ఐదెకరాలకు పైగా ఉన్నట్లు తేల్చారు. ఈ భూమిని ఈనెల 24న వేలం వేయనున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి

ఖమ్మంక్రైం: మద్యం మత్తులో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి బుధవారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. ఖమ్మం కాల్వొడ్డులోని వైన్స్‌కు కూసుమంచి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితులతో కలిసి వచ్చాడు. ఈమేరకు వారు ఆటోను కొద్దిదూరంలో పార్కింగ్ చేసి వైన్స్‌లోకి వెళ్లి బయటకు వచ్చాక ఆటోలో డాక్యుమెంట్లు కనిపించలేదు. దీంతో వైన్స్ నిర్వాహకులతో గొడవకు దిగి దాడి చేశారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పెట్రోకార్ రాగా వారితో మద్యం సేవించి ఉన్న వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. ఇంతలో అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ప్రసాద్ సముదాయించేందుకు యత్నించగా ఆయనపై మద్యం తాగిన వ్యక్తి, ఆయన స్నేహితులు ఆయనను కింద పడేసి కొట్టారు. అనంతరం మరికొందరు పోలీస్ సిబ్బంది చేరుకుని దాడి చేసిన వారిని స్టేషన్‌కు తరలించారు. అయితే, కానిస్టేబుల్‌పై దాడి చేసిన వారిపై ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడంతో తమ ఆత్మస్థైర్యం దెబ్బతింటోందని పోలీసు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా ఆయన ఆన్‌లైన్ వ్యాపారం చేస్తుండగా, చైన్ సిస్టమ్ ద్వారా పలువురి నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. అయితే, వారికి తిరిగి చెల్లించాల్సిన సమయం దాటినా ఇవ్వకపోవడంతో పలువురు ఇంటికి వచ్చి నిలదీస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గురువారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆయన ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అప్పు వసూలు కాకపోడంతో ఆత్మహత్య

కూసుమంచి: అప్పుగా తీసుకున్న డబ్బు ఇచ్చేది లేదని బెదిరించడంతో మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పాలేరుకు చెందిన బోయ సైదులు, ఆయన భార్య సీత కొంత కాలంగా కూసుమంచిలో ఉంటున్నారు. ఈక్రమంలో పాలేరుకు చెందిన బంధువులు పులగరి వీరబాబు – మహేశ్వరి దంపతులకు సీత తన వద్ద ఉన్న నగదుతో పాటు వేరొకరి వద్ద మరికొంత తీసుకుని రూ.2.30 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఈ నగదు తిరిగి ఇవ్వాలని కొంత కాలంగా సీత అడుగుతుండగా దాటవేస్తుండడంతో ఆమె ఈనెల 11న పాలేరులోని వీరబాబు ఇంటికి వెళ్లి నిలదీసింది. అయితే, డబ్బులు ఇచ్చేది లేదని, ఏమైనా చేసుకో అంటూ వీరబాబు దంపతులు సమాధానం చెప్పడంతో మనస్థాపానికి గురైన సీత(36) అదేరోజు ఇంటికి వచ్చి చీరతో ఉరి వేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఘటనకు వీరబాబు – మహేశ్వరి కారణమని సీత సోదరుడు తైదల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలు ధ్వంసం

సత్తుపల్లిరూరల్: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రెండు వాహనాలు దెబ్బతినగా, ఒకరికి గాయాలయ్యాయి. కిష్టారం నుంచి సత్తుపల్లికి వస్తున్న కారు అదుపు తప్పి గురవారం తెల్లవారుజామున చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ గాయపడగా ఖమ్మం తరలించారు. అలాగే, వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు పాదరక్షల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ లారీ సింగరేణి బైపాస్‌రోడ్‌లో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగిపోగా, ఎవరికీ గాయాలు కాలేదు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

సత్తుపల్లిరూరల్: మండలంలోని నారాయణపురంలో విద్యుత్‌షాక్‌తో ఓ ఆవు మృతి చెందింది. గ్రామంలోని మాజీ సర్పంచ్ దేశిరెడ్డి రంగారెడ్డికి చెందిన ఆవు మేతకు వెళ్తుంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్‌కు తాకింది. దీంతో రూ.70వేల విలువైన ఆవు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిందని రంగారెడ్డి తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ సుజాత పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

చోరీకి పాల్పడిన నలుగురు అరెస్ట్

ఖమ్మంక్రైం: బెదిరించి చోరీకి పాల్పడిన నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. జూలూరుపాడు మండలం రాంపురం తండాకు చెందిన వాంకుడోతు కిషోర్ కూతురు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఈనెల 18న వచ్చాడు. అయితే, ఆస్పత్రిలో నిద్రించే వసతి లేకపోవటంతో పాత బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ ఖమ్మంకు చెందిన హరీష్, హుస్సేన్, రెహమాన్, నవాబ్ కలిసి కిషోర్‌ను బెదిరించి ఆయన వద్ద సెల్‌ఫోన్‌తో పాటు రూ.10వేల నగదు లాక్కున్నారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.